అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల మూత



నాడు: గత ప్రభుత్వంలో కళకళలాడుతున్న డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



నేడు: అగ్రి టెస్టింగ్ ల్యాబ్ మూతపడడంతో పిచ్చి మొక్కలు మొలిచిన దృశ్యం

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసే రైతులు నష్టపోకూడదని నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పరితపించారు. వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేశారు. ఆయన బాటలో గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నడిచారు. రైతులకు స్థానికంగానే అన్ని సేవలూ అందేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. భూసారంతోపాటు విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించేందుకు నియోజకవర్గానికి ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్ తీసుకువచ్చారు. అవి రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను మూసేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చినవి కావడంతోనే ల్యాబ్‌లను మూత వేసినట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

- రైతులకు ఎంతో ఉపయోగపడిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- ఎక్కడికక్కడే భూసార పరీక్షలు చేసేలా ఏర్పాట్లు
- వైఎస్సార్‌సీపీకి పేరు వస్తుందనే కుట్ర
- ఇది మంచి పద్ధతికాదంటున్న రైతులు

సూళ్లూరుపేట : గత ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో వుంచుకుని నియోజకవర్గానికి ఒక అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను నిర్మించింది. ఇందుకోసం ఒక్కోదానికి సుమారు రూ.79 లక్షల ఖర్చు చేసింది. సుమారు రూ.కోటితో అత్యంత అధునాతన పరికరాలను ఏర్పాటు చేయడంతోపాటు ల్యాబ్ టెక్నీషియన్లను నియమించింది. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నాణ్యతతోపాటు భూసార పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంది. గతంలో ఈ పరీక్షలు చేయించాలంటే జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఏ నియోజకవర్గానికి సంబంధించిన రైతులు అక్కడే విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలు చేయించుకునే వీలు కల్పించింది. అదేవిధంగా పశువుల్లో వచ్చే వ్యాధులను నిర్ధారించి చికిత్స అందించేలా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటు చేసింది. తద్వారా పాడి రైతులకు వ్యయ ప్రయాసలను తగ్గించింది. అంతులేని జబ్బులతో పశువులు మృతిచెందకుండా చర్యలు తీసుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజలకు తెలియకూడదనే కూటమి ప్రభుత్వం వాటిని మూసేసిందని రైతులు ఆరోపిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తెలియకూడదనే..

గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలియకుండా వుండాలని కూటమి కుట్ర చేస్తోంది. అందులో భాగంగానే పథకం ప్రకారం రూ.కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజే వీటిని పూర్తిగా మూసివేశారు. ఈ రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 1.20 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. అలాగే 80 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు వాడే పురుగు మందులు, ఎరువులు నాణ్యంగా వున్నాయా? లేదా అని పరీక్షలు చేయించుకునే అవకాశం లేకుండా చేశారు. తమ శ్రేయస్సు కోసం తీసుకువచ్చిన ల్యాబ్‌లను ఎందుకు మూసివేశారని రైతులు ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పడం లేదు.

ల్యాబ్‌ను ఎందుకు మూసి వేశారో..?



అగ్రి ల్యాబ్‌లు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను ల్యాబ్‌లో పరీక్షించి తెలుసుకుంటాం. ఇది వరకు ఎక్కడో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. గత ప్రభుత్వం నియోజకవర్గంలో రైతులకు అందుబాటులో ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ వాటిని మూసివేడం తగదు.

- సుంకర అల్లెయ్య, రైతు నాదెళ్లవారికండ్రిగ

దురుద్దేశంతోనే మూత



రైతులకు అందుబాటులో ఉండేలా గత ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రంలో అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేసింది. మట్టి నమూనాలు ఇస్తే పరీక్షించి ఫలితాలు చెప్పేవారు. అలాగే విత్తనాలు, ఎరువుల మీద అనుమానాలుంటే వెంటనే ల్యాబ్‌కు వెళితే పరీక్షలు చేసి ఇచ్చేవారు. రైతులకు ఎంతో ఉపయోగంగా వున్న ఇలాంటి ల్యాబ్‌ను మూసివేయడం వెనుక ప్రభుత్వ దురుద్దేశం దాగి వుంది.

- మందా దేవేందర్‌రెడ్డి, సుగ్గుపల్లి

ల్యాబ్‌ల మూత మంచి పద్ధతి కాదు



రైతుల సంక్షేమం కోసం సుమారు రూ.కోటి వెచ్చించి ల్యాబ్ ఏర్పాటుచేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ల్యాబ్‌లను మూసివేశారు. ఇది మంచి పద్ధతి కాదు. ముఖ్యంగా పశువుల్లో వస్తున్న వ్యాధులను నిర్ధారించుకోవాలంటే తిరుపతికో, నెల్లూరుకో పోవాల్సి వస్తోంది. అదే ఇక్కడ వుంటే వ్యయ ప్రయాసలు తప్పుతాయి కదా! ఈల్యాబ్‌ను అందుబాటులో వుంచాలి.

- వాకాటి బాబురెడ్డి, గోపాల్‌రెడ్డిపాళెం

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: జేఎన్‌టీయూఏ హ్యాండ్ బాల్ జట్టుకు విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు ఇందువర్షిణి, మనోప్రియ, వెంకటసౌమ్య, ప్రసాద్, వినయ్ ఎంపికైనట్లు కళాశాల పీడీ మల్లికార్జున్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన పులివెందులలో జరిగిన జేఎన్‌టీయూఏ సెలక్షన్స్‌లో వారు ప్రతిభ చూపినట్లు తెలిపారు. వారు జనవరిలో సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో జేఎన్‌టీయూఏ తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు

చిల్లకూరు: కార్తీకమాస పర్వదినాన్ని పురస్కరించుకుని కోటకు చెందిన కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం కార్తీకమాస వనభోజనాలు ఏర్పాటు చేశారు. చిల్లకూరు మండలం కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిధిలో ఉసిరి చెట్ల కింద వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని వనంలో ధాత్రి వృక్షానికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ కార్తీక మాసంలో వనభోజనాలు ఎంతో శ్రేష్ఠమని, ఉసిరి చెట్టుకింద భోజనం ఆరోగ్యకరమన్నారు.

ప్రమాదకరంగా దగ్గవోలు చెరువు కట్ట

దక్కిలి: మండలంలోని దగ్గవోలు చెరువు కట్ట ప్రమాదకరంగా ఉంది. కట్ట మధ్యలో గుంతలు పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయని, చెరువు నిండితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పెద్ద తూముకు సమీపంలో ఓ భారీగా గుంత ఉంది. వర్షాకాలంలో చెరువు కట్టలను పటిష్ట పరచాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా స్పందించి కట్ట బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి



కొత్త వ్యక్తుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న సీఐ కిషోర్‌బాబు

చిల్లకూరు: గ్రామాల్లో కొత్త వారు ఎవరైనా సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని గూడూరు రూరల్ సీఐ కిషోర్‌బాబు సూచించారు. చిల్లకూరులో ఆదివారం కార్డన్ సర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో సోదాలు నిర్వహించి అనుమానం ఉన్న వారిని విచారించారు. ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీల్లో కొంతమంది అసాంఘిక శక్తులు ఉండే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఎవరైనా కొత్తవారు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. చిల్లకూరు ఎస్‌ఐ సురేష్‌బాబు, గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సండే మార్కెట్ తరహాలో మద్యం దుకాణాలు



శ్రీకాళహస్తి రోడ్డులో కంటైనర్‌లో మద్యం దుకాణం ఏర్పాటుకు సిద్ధం చేసిన స్థలం

తడ: మండలంలో సండే మార్కెట్ తరహాలో మద్యం దుకాణాలను జనావాసాల మధ్య ఒకే చోట ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. రామాపురంలో ఒకటి, కారూరులో ఒకటి చేపడుతున్నారు. తడలో ఇప్పటి వరకు శ్రీకాళహస్తి రోడ్డులో ఒక షాపు మాత్రమే ఉండేది. తడలో మిగిలిన రెండు షాపుల్లో ఒకటి రైల్వేస్టేషన్ సమీపంలోను, మరొకటి స్టేషన్ రోడ్డు ఎదురుగా ఉండేవి. జాతీయ రహదారి సమీపంలో మద్యం దుకాణాలు ఉండకూడదన్న నిబంధనల మేరకు ఈ రెండింటిని శ్రీకాళహస్తి రోడ్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే పూడి, రాచకండ్రిగ చెరువుల్లోనుంచి మట్టిని భారీగా తరలించి చదును చేశారు. ఈ మద్యం దుకాణాలు శ్రీకాళహస్తి రోడ్డు పక్కనే ఉండడంతో నిత్యం శ్రీకాళహస్తి, తిరుపతి, సత్యవేడు ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనదారులకు తలనొప్పిగా మారే అవకాశం ఉంది. దీనికి తోడు చుట్టూ జనావాసాలు ఉండడంతో ఇప్పటికే రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాపులన్నీ అధికార పార్టీ నేతలకు చెందినవే కావడంతో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు సిద్ధలయ్య కోనలో తిరునాళ్లు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో వెలసిన సిద్ధలయ్యస్వామి కోనలో కార్తీక మాసం 2వ సోమవారం తిరునాళ్లు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇక్కడ దైవాంశ సంభూతులైన ఇద్దరు యోగీశ్వరులు నవకోటి సిద్ధలయ్య, నవనాథు సిద్ధలయ్య, వారి ప్రియ శిష్యుడు సారంగధరుడు వెలిశారు. 2వ సోమవారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనవాతీ. భక్తులకు ఆకతాయిల బెడద లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు.

13న పెంచలకోనలో అష్టోత్తర శత కలశాభిషేకం

రాపూరు: మండలంలోని పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం చిలుక ద్వాదశిని పురస్కరించుకుని అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. చిలుక ద్వాదశి సందర్భంగా నిత్య కైంకర్యాల అనంతరం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పాలు, తేనె, పెరుగు, నెయ్యి, చందనం, పసుపు, కుంకుమ, కొబ్బరి నీరు, తులసిమాల, వివిధ ఫలరసాలు, 108 కలశాలలోని జలాలతో అభిషేకం చేస్తామని తెలిపారు. మధ్యాహ్నం ఉసిరి, తులసి చెట్లకు ప్రత్యేక పూజలు, కార్తీక వన భోజనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

14 నుంచి ఎస్సీ గురుకులాల జోనల్ క్రీడా పోటీలు

కోట: కోట ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 14 నుంచి మూడు రోజులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల జోనల్ లెవల్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పోటీల్లో జోనల్ పరిధిలోని గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచి 17 స్కూల్స్, 12 కళాశాలల నుంచి 680 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడా పోటీల కోసం గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

తప్పుడు కేసులకు భయపడం

- కూటమి నేతలు యథేచ్ఛగా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు
- బెల్టుషాపులకు వేలంపాటలు జరుగుతున్నా పోలీసులకు కనిపించడం లేదు
- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఫైర్



నాయుడుపేట పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి

నాయుడుపేట టౌన్ : పోలీసులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పుడు కేసులు పెట్టినా తాము భయపడమని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. సత్యనారాయణరెడ్డిపై నమోదైన రెండు కేసులకు సంబంధించి రూరల్ సీఐ సంగమేశ్వరరావు ఆదివారం నాయుడుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. ఆయన అక్కడికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయుడుపేట, పెళ్లకూరు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 8 నెలల క్రితం తాను అమెరికాలో ఉన్నప్పుడు చెరువు మట్టి తవ్వకాలు, పొర్లుకట్టల వద్ద ఇసుక తరలించినట్టు తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. టీడీపీ నేతలు పట్టపగలే టిప్పర్లలో ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తున్నా పోలీసులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏ ఒక్కరిపైనా కేసు నమోదు చేయలేదన్నారు. బెల్టుషాపులు పెట్టొద్దని సీఎం చంద్రబాబు చెప్పినా.. గ్రామాల్లో మూడేసి బెల్టుషాపులు పెట్టి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడని దుయ్యబట్టారు. బెల్టుషాపుల ఏర్పాటుకు పబ్లిక్‌గానే రూ.లక్షల్లో వేలంపాట జరుపుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని, ప్రజల దృష్టి మరల్చేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. పెళ్లకూరు జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, ఎంపీపీ శేఖర్ రెడ్డి, నాయకులు కిలికి మాధవరెడ్డి, కిషోర్ యాదవ్, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, కట్టా కమలాకర్ రెడ్డి, న్యాయవాది చదలవాడ కుమార్, షేక్ షబ్బీర్, నాయుడుపేట, పెళ్లకూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కండలేరులో 50.649 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 50.649 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3500 క్యూసెక్కుల నీరు చేరుతోందని పేర్కొన్నారు. అలాగే కండలేరు జలాశయం నుంచి సత్యసాయిగంగ కాలువకు 1070, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు భూముల కౌలుకు వేలం పాటలు

సైదాపురం: మండలంలోని తుమ్మలతలుపూరు గ్రామంలోని సోమేశ్వర స్వామి ఆలయ భూముల కౌలుకు మంగళవారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆలయానికి 7.85 ఎకరాల మాగాణి భూమి ఉందన్నారు. దాన్ని ఏడాది పాటు కౌలుకు నిర్వహించేందుకు వేలం పాటలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

13న డక్కిలి మండలంలో..

డక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామంలో వెలసిన నాగలింగేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయ భూములకు 13న గ్రామ చావిడి వద్ద వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. భూములను ఏడాదికి కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

కండలేరు డ్యామ్ ఎస్‌ఐగా రామకృష్ణ



రాపూరు: మండలంలోని కండలేరు డ్యామ్ ఎస్‌ఐగా రామకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ కిషోర్‌బాబు అల్లూరుకు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న రామకృష్ణ ఇక్కడికి వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఎస్‌ఐ తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న పేకాటరాయుళ్లు

చిల్లకూరు: మండలంలోని కడివేడు ప్రాంతంలో రాత్రిపూట పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.15,370 నగదు, నాలుగు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు దాడులు చేశామని పేర్కొన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు



విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

వెంకటగిరి రూరల్ : ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాలలను నిర్వహిస్తే యాజమాన్యాలపై చర్యలు తప్పవని ఎంఈవో వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆయన ఆదివారం అపార్ ఐడీ నంబర్, ఎఫ్ఏ-2 మార్కులు ఆన్‌లైన్ నమోదు పరిశీలనలో భాగంగా వెంకటగిరిలోని నారాయణ పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులు ఉండడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యార్థులను ఇళ్లకు పంపివేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు వ్యవహరించడం తగదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏంఈవో-2 బాబయ్య, సీఆర్‌పీ బాబు తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో సందర్శకుల సందడి







విహంగాలను వీక్షించేందుకు వస్తున్న సందర్శకులు, పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు, చెట్లపై విడిది చేస్తున్న గూడ బాతులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ఆదివారం సందర్శకులతో నిండిపోయింది. కేంద్రంలో విడిది చేస్తున్న విదేశీ శీతాకాలపు వలస విహంగాలను వీక్షించేందుకు ఆదివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు, పక్షి ప్రేమికులు పెద్దఎత్తున విచ్చేశారు. సందర్శకుల సౌకర్యార్థం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు చెరువు కట్టపై ఉన్న వ్యూ పాయింట్ల వద్ద ఫారెస్ట్ సిబ్బందిని, వివిధ రకాల విహంగాలను దగ్గరగా వీక్షించేలా బైనాక్యులర్స్ వంటివి అందుబాటులో ఉంచారు. విహంగాల గురించి వివరించేందుకు సందర్శకుల కోసం నేచర్ గైడ్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పక్షుల కేంద్రంలో నత్తగుల్ల కొంగలు, గూడబాతులు, నీటికాకులు, తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కు కొంగలు, కూట్స్, డ్యాబ్‌చిక్స్, స్వాతికొంగలు తదితర పక్షులు చెట్లపై గూళ్లు కట్టుకుని ఉన్నాయి. గూడబాతులు చెరువులో ఈత కొట్టే దృశ్యాలు పక్షి ప్రేమికులను ఆకట్టుకున్నాయి. అలాగే పర్యావరణ కేంద్రంలో జీవనశైలి చిత్రాలు, మార్గమధ్యంలోని పార్కులో జింకలు, పంజరంలోని రామచిలుకలు చిన్నారులను బాగా ఆకట్టుకున్నాయి.

టీడీపీలో మొదలైన వర్గపోరు



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి

కోట: కోట టీడీపీలో వర్గపోరు మొదలైంది. కూటమి నేతలు ప్రతిపక్ష నాయకులపై దాడులకు దిగుతున్నారు. అంతేగాక అక్రమ కేసులు పెడుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది ప్రతిపక్ష నాయకులు టీడీపీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. కొత్త వారికి ప్రాధాన్యం ఇస్తుండడంతో టీడీపీలోని పాతకాపులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వర్గపోరుకు సిద్ధపడుతున్నారు. గూడూరు నియోజకవర్గంలో నల్లపరెడ్లకు రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. వారి కుటుంబంలోని ఒకరు అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోతుంటారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీలో పదవులు పొంది స్థానికంగా పలు దందాలకు పాల్పడి పార్టీ విచ్ఛిన్నానికి కారకుడైన వ్యక్తి నేడు అధికారంలో ఉన్న టీడీపీ వైపు అర్రులు చాస్తూ పచ్చకండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యాడు. ఆయన టీడీపీలో చేరుతున్నట్టు నియోజకవర్గ ప్రజాప్రతినిధి సమక్షంలో ఆదివారం ప్రకటించారు. ఆయన రాకను టీడీపీలో ఉన్న పాతకాపులు వ్యతిరేకించడంతో ఒక్కసారిగా వర్గ విభేదాలు బట్టబయలయ్యాయి. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు పలువురు హాజరుకాలేదు. కరోనా సమయంలో కోట పంచాయతీలో రూ.30 లక్షలు నిధులు గోల్‌మాల్ అయ్యాయి. దీనికి కారణం ఆయనేనంటూ నాడు టీడీపీ నాయకులు దుమ్మెత్తి పోశారు. ఇప్పుడు ఆయన టీడీపీలోకి రావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధుల గోల్‌మాల్ విషయంలో అప్పట్లోనే నల్లపరెడ్ల కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండిస్తూ ఆ వ్యక్తి మా కుటుంబానికి చెడ్డ పేరు తెస్తున్నాడని హెచ్చరించారు. నిధులు దిగమించిన వ్యక్తిని మళ్లీ అధికారంలోకి వచ్చిన పార్టీలో ఎలా చేర్చుకుంటారంటూ కోట ప్రజలు మండిపడుతున్నారు. ఇలాంటి వ్యక్తి పార్టీలోకి వస్తే ప్రజలకు ఏమి సమాధానం చెబుతామంటూ టీడీపీ నాయకులు సైతం ఆవేదన చెందుతున్నారు. గత ఐదేళ్లుగా కోటలో ఆ వ్యక్తితోనే పోరాటం చేశామని, ఇప్పుడు ఆయనతో కలిసి పనిచేయలేమని కొందరు టీడీపీ నేతలు బహిరంగంగా చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీకి రాజీనామా..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆదివారం పార్టీ పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన నివాసానికి విచ్చేసిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో చర్చలు సాగించిన అనంతరం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు.

అమరవీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

రాపూరు: రాపూరు అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన వారికి నివాళులర్పించారు. రేంజర్ రవీంద్రబాబు మాట్లాడుతూ అటవీ సంరక్షణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను సంస్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అడవుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అటవీ సంరక్షణలో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు చాకచక్యంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఏదైనా సమాచారం అందినప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని వెల్లడించారు.

దేవుడికి దశమ భాగాలు ఇవ్వాలి



దేవుడి సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ శరత్ బాబు

చిల్లకూరు : ప్రతి మినిషీ జీవితంలో తాను సంపాదించిన మొత్తంలో 10వ వంతు దేవునికి ఇవ్వాలని పుత్తూరుకు చెందిన సాలో మినిస్ట్రీస్ పాస్టర్ డాక్టర్ శరత్ బాబు తెలిపారు. గూడూరు పట్టణంలోని సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చిలో మూడు రోజులు పాటు నిర్వహించిన దశమ భాగాల పండుగ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన దేవుడి సందేశాన్ని వినిపించారు. ఏసు క్రీస్తు చూపిన మార్గాల్లో ప్రయాణిస్తే ప్రపంచం శాంతితో నిండుతుందన్నారు. అనంతరం చర్చి సభ్యులు దేవునికి కృతజ్ఞతా పూర్వకంగా దశమి భాగాలు అందజేశారు. సంగ కాపరి, రెవరెండ్ డేవిడ్ ప్రశాంత రాజ్, సభ్యులు రాజయ్య, విజయకుమార్, కన్నమ్మ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్య నారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న వేద పండితులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని గమళ్లపాళెంలో ఉన్న పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురష్కరించుకుని ప్రతి ఏటా ఆలయంలో స్వామి వారి వ్రత కల్పం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని సామూహికంగా నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.